కంపెనీలు కదిలేనా... కాలుష్యం వదిలేనా!

హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త

నగరంలో పారిశ్రామిక వాడలు కాలుష్యపు జాడలుగా మారాయి. నగరవాసిని కాలుష్యభూతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతోంది. కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్యకారక పరిశ్రమలను శివారులోకి తరలించాలనే ప్రతిపాదన మరోసారి తెరమీదికి వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు ఈ పరిశ్రమలను తరలించాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల తరలింపు ప్రక్రియను వేగిరం చేయాలని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంత్రాంగాన్ని ఆదేశించారు. పరిశ్రమలను శివారులోకి తరలించాలని 2012లో అప్పటి కిరణ కుమార్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా కేసీఆర్ సర్కారు కూడా ఈ అంశంపై కసరత్తు చేసింది. అయితే, ఈ వ్యవహారం ఆశించిన మేరకు ఫలితాలనివ్వలేదు. పారిశ్రామిక వేత్తల లాబీయింగ్ పరిశ్రమల తరలింపు ప్రక్రియకు బ్రేక్ పడింది. కాలుష్య ఉద్గారాలను వెదజల్లుతున్న పరిశ్రమలు జనావాసాల్లో కొనసాగడం శ్రేయస్కరం కాదని, మొదట్లో పారిశ్రామికవాడలు శివార్లలో ఉన్నప్పటికీ నగరీకరణ నేపథ్యంలో అక్కడ కూడా కాలనీలు వెలిసినందున వీటి తరలింపు అనివార్యమని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే రసాయనిక కంపెనీలను సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల్లో టీజీఐఐసీ ఆధ్వర్యంలో భూములను సేకరించి, పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేశారు. ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించారు. భూములను తీసుకున్న పరిశ్రమలు తమ కార్యకలాపాలను మాత్రం నగరం నుంచే కొనసాగిస్తున్నాయి.

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల వేల సంఖ్యలో చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు ఉన్నాయి. జీడిమెట్ల, కాటేదాన్, బొల్లారం, భోలక్‌పూర్, చర్లపల్లి, లింగంపల్లి తదితర పారిశ్రామిక వాడల్లో

బీహెచ్‌ఈఎల్, ఐడీపీఎల్, హెచ్ఎంటీ, తోళ్ల పరిశ్రమ, ఐరన్, స్టీల్ వంటి భారీ పరిశ్రమలతో పాటు పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు ఏర్పాటయ్యాయి. వాటికి అనుసంధానంగా మరికొన్ని పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉద్యోగులు, కార్మికులు, ఉపాధి కోసం వివిధ వర్గాలకు చెందినవారు నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో కాలుష్య ప్రభావంతో జనాలు రోగాల బారిన పడుతున్నారు. వ్యర్థ జలాల నిర్వహణ అధ్వానంగా ఉంది. సాధారణ మురుగు కాలువల్లో ప్రమాదకరమైన రసాయన వ్యర్థ జలాలను విడిచిపెడుతుండటం స్థానికులకు సంకటంగా మారింది. స్థానికుల నుంచి ఫిర్యాదు వస్తేనే పీసీబీ అధికారులు చర్యలకు ఆదేశిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మూసివేయాలని చెప్పినా, అనధికారికంగా కార్యకలాపాలను నడిపిస్తున్నారు.

రాష్ట్రంలో సుమారు 3,800 రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉండగా అందులో సుమారు 2 వేలకు పైగా పరిశ్రమలు నగరంలోనే ఉన్నట్లు అంచనా. ఆరెంజ్ కేటగిరీలోని 4 వేలకుపైగా పరిశ్రమల్లో సుమారు 2,500 వరకు నగర పరిధిలోనే ఉండొచ్చని అంచనా. వీటిల్లో ఇప్పటి వరకు సుమారుగా 40 శాతం కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. భోలక్‌పూర్‌ని తోలు పరిశ్రమను మేడ్చల్ జిల్లాకు, ఇనుము, స్టీల్ పరిశ్రమలను వికారాబాద్ జిల్లా రాకచర్లకు, నూనె తయారీ పరిశ్రమలకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో టీజీఐఐసీ మౌలిక వసతులను అభివృద్ధి చేసి, పరిశ్రమల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. ఆసక్తి ఉన్న పరిశ్రమలకు ఆయా ప్రాంతాల్లో స్థలాలను కేటాయించారు. కొంత కాలం వేచి చూసి మీరు వెళ్లకపోతే ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించినా యాజమాన్యాల్లో పెద్దగా మార్పు కనిపించలేదు.

గేదెలతో కిటకిటలాడిన పశు సంక్రాంతి జాతర

- రూ.3.50 లక్షల రికార్డు ధర పలికిన ముర్రాజాతి గేదెలు
- జాతరలో గేదెలతో భారీ ఊరేగింపు నిర్వహించిన వ్యాపారులు, రైతులు

గేదెల ఊరేగింపులో పాల్గొన్న పాలక కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు, తదితరులు

వ్యాపారులు,రైతులను ఆకట్టుకుంటున్న ధూళియా జాతి గేదెల దృశ్యం

నార్సింగి, జనవరి 23 ప్రభాతవార్త : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగర శివారు ప్రాంతంలోని గండిపేట మండలం నార్సింగి గ్రామంలో శుక్రవారం జరిగిన "పశు సంక్రాంతి" పర్వదినం కన్నుల పండువగా సాగింది. వంద సంవత్సరాలకు ముందు నుంచే నార్సింగి గ్రామంలో ఈ పశువుల సంత కొనసాగుతూ వస్తుంది. ప్రతిఏటా సంక్రాంతి పర్వదినం జరిగిన రెండో శుక్రవారం నాడు నార్సింగిలోని పశువుల సంత వందలాది పశువుల క్రయ విక్రయాలతో కిటకిటలాడుతుంటుంది. సంక్రాంతి పర్వదినం నాటికి పొలాల్లోని పంటంతా రైతులు కోసుకొని ఇళ్లకు తెచ్చుకుంటారు. అవసరాలకు సరిపడా ధాన్యాలను ఇళ్ల వద్దనే ఉంచుకొని మిగితా ధాన్యాలను విక్రయిస్తారు. ఇలా విక్రయించగా వచ్చిన ఆదాయంతో పశు సంక్రాంతి రోజున పాడినిచ్చే మేలు రకమైన గేదెలు, ఆవులను కొనడం దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఈ నార్సింగి పశువుల సంత నుంచే నిజాం నవాబులకు పాల సరఫరా జరుగుతుందేదని పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. ఆనాటి నుంచే నార్సింగి గ్రామంలో పశువుల సంతకు ప్రత్యేకత ఉండేదని స్థానికులు వివరించారు. దేశంలోనే ఈ పశు సంక్రాంతి పర్వదినం కేవలం రెండు ప్రాంతాలలో నిర్వహిస్తారని, సంక్రాంతి పర్వదినం ముగిసిన తోలి శుక్రవారం మహారాష్ట్రలోని షోలాపూర్‌లో, రెండో శుక్రవారం గండిపేట మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

ఈ క్రమంలోనే శుక్రవారం నార్సింగి గ్రామానికి మన రాష్ట్రంలోని రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఒంగోలు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలయిన తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, హర్యాన, ఒరిస్సా, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున గేదెలు వచ్చాయి. 500కు పైగా మేలు రకమైన గేదెలు నార్సింగి గ్రామంలో అమ్మకానికి వచ్చాయి. ఈ గేదెలను రైతులువ్యాపారాలు,చూపరులను ఆకట్టుకునే విధంగా అందంగా ముస్తాబు చేశారు. బంతి పూల దండలు, రిబ్బెన్లు, ముువ్వలు కట్టి రంగులు చల్లి గేదెలను భాజా బజంత్రీల మధ్య ఊరేగించారు. వ్యాపారులు మేలు రకమైన గేదెలను కొనేందుకు ఎగబడ్డారు.

ఈ సంవత్సరం నార్సింగి పశు సం క్రాంతి పర్వదినంలో ముర్రెజాతి గేదెను రూ. 3.50లక్షలకు. మరో 9.గేదెలను రూ.3.11.లక్షల చొప్పున రూ.27.99.లక్షలకు బోరంపేట్ ప్రాంతానికి చెందిన రామిరెడ్డి కొన్నాడు. ఇలా రూ. 50.వేల మొదలు కొని రూ.80వేలు, రూ.లక్ష, రూ.లక్షన్నర, రూ.2.లక్షలు, గరిష్టంగా రూ. 3.50.వేల వరకు ఈ సంవత్సరం గెదెల అమ్మకాలు జరిగాయని నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్ వివరించారు. ఈ సంవత్సరం కేవలం రూ.40.వేల మార్కెట్ పీజు వచ్చిందని, గత ఏడాదితో పోలిస్తే సగం ఆదాయమే వచ్చిం దని మార్కెట్ కార్యదర్శి ఐశ్వర్య లక్ష్మీ వివరించారు.

కిటకిటలాడిన పశువుల సంత :

నార్సింగి పశువుల సంతను చూసేందుకు హైదరాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చెల్, నల్గొండ, మెదక్ జిల్లాలకు చెందిన రైతులు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, వందలాది మంది ప్రజానికంతో కిటకిటలాడింది. పిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ క్యాతం దశరథ్ యాదవ్, డైరెక్టర్లు దారుగుపల్లి బాల్‌రామ్, తలారి ప్రేమ్ కుమార్, శేఖర్‌బాబు యాదవ్, ఏర్పుల కుమార్, ధర్మపురి ముదిరాజ్, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీటీ నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

-పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

జూబ్లీహిల్స్, జనవరి 23, ప్రభాతవార్త: ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని ఎన్‌బీటీ నగర్‌లో రూ.8.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జోనల్ కమిషనర్ ప్రియాంక తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఖరీదైన స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించడం అంత సులభం కాదని తెలిపారు. ఈ హాల్ బస్తీ వాసులకు వివాహాలు, మహిళా సంఘాల సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థుల స్కూల్ కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వసంతపంచమి వంటి శుభదినాన హాల్‌ను ప్రజలకు అంకితం చేయడం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆనందంగా ఉందన్నారు.ప్రజా పాలన ప్రభుత్వంలో రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ జరిగేదని, ప్రస్తుతం 100 శాతం సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. ప్రతి గుడిసె నుంచి బిల్డింగ్ వరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వడ్డీలేని రుణాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి విజన్‌తో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.

గోదావరి ఫేజ్-2 నీటిని నగరానికి తీసుకొస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ దాహార్తి తీరుస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణంలో అనేక అవాంతరాలు ఎదుర్కొన్నప్పటికీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కృషితో ఈ భవనం పూర్తి చేయగలిగామని మంత్రి అభినందించారు.

హైదరాబాద్ వార్త

నగరంలో నరకం!

-విలువైన సమయం వృధా
-పడిపోతున్న వాహనాల మైలేజీ
-తీవ్రతరంగా ట్రాఫిక్ రద్దీ

హైద్రాబాద్, జనవరి 23 ప్రభాతవార్తః

నగరవాసులకు గురువారం నరకం కనిపించింది. మహానగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఎన్ని ఆకాశమార్గాలు నిర్మించినా ఫలితం ఉండటం లేదు. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్ ఆగిపోతున్నా కొన్ని చౌరస్తాల్లో ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదు. కనిపించినా కేవలం ట్రాఫిక్ పెండింగ్ ఛలాన్ల తనిఖీలకు, ట్రాఫిక్ ఉల్లంఘించిన వాహనాల ఫొటోలు తీయడానికి పరిమితం అవుతున్నారు.దీంతో ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించుకొని ఇంటికి చేరాలంటే పద్మవ్యూహాన్ని ఛేధించినంతగా శ్రమించాల్సి వస్తోంది. ట్రాఫిక్ జామ్‌లను నివారించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఛలాన్‌లు విధించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలను చేసినా ట్రాఫిక్ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. చాలా వరకు ప్రధాన రోడ్లన్ని వాహనాలతో నిండిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి గమ్యస్థానాలు చేరుకోడానికి రెండు, రెండున్నర గంటల పాటు ఇబ్బందులు పడకతప్పడం

లేదు. వాహనాలు రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు కనీసం గంటన్నర సమయం పడుతుందంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. దీంతో వాహనాల విలువైన సమయం వృథా కావడంతో పాటు గమ్యం చేసేవరకు రోడ్ల వాహనాల ఇంజన్ ఆన్‌లో ఉండడంతో పెట్రో డీజిల్ ఆవిరైపోతున్నాయి.

గతంలో ఎన్నడూలేనంతగా..

నగరంలో నిత్యం కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. అవన్నీ రెండు మూడు గంటల్లోపు సాఫీగా మారతాయి.ఇటీవల ఎన్నడూ కనిపించని ట్రాఫిక్ సమస్య ఇటీవల తీవ్రరూపం తలెత్తుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏ మార్గంలో వెళ్లినా కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయి కనిపించాయి. మాదాపూర్- జూబ్లీహిల్స్- బంజారాహిల్స్, మెహిదీపట్నం- మాసాబ్‌ట్యాంక్, అసెంబ్లీ- అబిడ్స్, హబ్సిగూడ-నాచారం తదితర ప్రాంతాల్లో సాయంత్రం వరకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. అమీర్‌పేట్-పంజా గుట్ట-ఖైరతాబాద్-లక్డీకాపూల్, మలక్‌పేట్-దిల్‌సుఖ్‌నగర్, మెట్టుగూడ- తార్నాక- ఉప్పల్-మేడిపల్లి, బేగంపేట్-రసూల్‌పురా-సికింద్రాబాద్- మినిస్టర్‌రోడ్, బేగంబజార్- చార్మినార్ లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యం అయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే దాదాపు రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. గతంలో పండుగలు, ఆదివారాలలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. కాని ఇప్పుడు దానికి భిన్నంగా తయారైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడినా అవి గంట సమయంలోనే సాఫీగా మారతాయి. వర్షాకాలం వస్తే మాత్రం ఎప్పటికి ట్రాఫీక్ క్లీయర్ అవుతుందో చెప్పలేని పరిస్థితి.

మహా సరస్వతిదేవిగా అంబర్‌పేట మహంకాళి అమ్మవారు

హైదరాబాద్, జనవరి 23 ప్రభాతవార్త

వసంత పంచమి (శ్రీపంచమి) సందర్భంగా అంబర్‌పేట మహంకాళి అమ్మవారు మహా సరస్వతి దేవీగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆమ్మవారికి 56 చప్పన్ భొగ్ యాభై ఆరు రకలా మిఠాయిలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఎం.అనిల్ కుమార్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ,కార్పొరేటర్లు బి.పద్మ వెంకట్ రెడ్డి, ఈ.విజయ్ కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పద్మావతి డీపీరెడ్డి,అడిషనల్ డిసిపి నరసయ్య,సీఐ కిరణ్ కుమార్ , కమిటి సభ్యులు పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, కె.దుర్గప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్ గౌడ్, రంగంపల్లి రాజు, బింది మల్లికార్జున్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, చంగలి సుధాకర్, దొమకొండ కిషోర్, పంజాల గిరిధర్‌గౌడ్,పంజాల వెంకటేశ్‌గౌడ్, కోటం అనిల్‌కుమార్ ,గడ్డం సునిల్‌గౌడ్ ,పిల్లి చంద్రశేకర్ ,బింది శశికాంత్ గౌడ్ , రోహన్‌గౌడ్ , సందీప్‌గౌడ్ , ప్రదీప్‌గౌడ్, సాయికిరణ్ పాల్గొన్నారు.



మహాసరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అంబర్‌పేట మహంకాళి అమ్మవారు

కంటోన్మెంట్ జిహెచ్ఎంసిలో విలీనం అయ్యేంత వరకు ఉద్యమించాలి : మధు యాష్కి

కార్కానలో ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మాజీ ఎంపీ మధు యాష్కి తదితరులు

కంటోన్మెంట్,జనవరి 23 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం కోసం ఢిల్లీ స్థాయిలో తన వంతు ప్రయత్నిస్తానని మాజీ ఎంపీ,టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ తెలిపారు. కార్కానలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తలపెట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 4వ రోజుకు చేరింది. ఆయన చేపడుతున్న న్యాయమైన పోరాటానికి మాజీ ఎంపీ ఈటెల రాజేందర్ సంపూర్ణ మద్ధతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కంటోన్మెంట్‌లోని సివిలియన్ ప్రాంతాలను జిహెచ్ఎంసిలో విలీనం చేసే విధంగా ఒత్తిడి తేవాలన్నారు. కంటోన్మెంట్ ప్రజల డిమాండ్‌ను రాహుల్ గాంధీ దృష్టికి తెచ్చి పార్లమెంట్‌లో ఒత్తిడి తెస్తామన్నారు. కంటోన్మెంట్ ప్రజల న్యాయమైన పోరాటానికి రాజకీయ పార్టీలకు అతీతంగా మద్ధతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్, సీనియర్ కాంగ్రెస్ నేతలు బొల్లు కిషన్, శ్యామ్ సన్‌రాజు, సి.సంతోష్ యాదవ్, చిర్రబోయిన వైష్ణవి యాదవ్, సదానంద్,నాగినేని సరిత,రాజేష్ యాదవ్, మురళీ ముదిరాజ్,ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రతే ప్రాధాన్యం

- సైబరాబాద్ సిపి రమేష్ రెడ్డి

హెల్మెట్‌ను అందజేస్తున్న సీపీ రమేష్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 23, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో కూకట్‌పల్లి పోలీస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం అత్యంత అవసరమని అన్నారు. కాలం విలువైనది, ప్రాణం అమూల్యం అని పేర్కొంటూ డ్రైవింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ఉపయోగించడం, అతివేగం నివారించడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించకపోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నెమ్మదిగా, జాగ్రత్తగా వాహనాలు నడిపితేనే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సీఐ కె.వి. సుబ్బారావు, ఎస్సైలు రామకృష్ణ, చంద్రశేఖర్, దీక్షిత తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్, ఆర్టీసీ అధికారులు హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి పాల్గొని సీపీ రమేష్ రెడ్డి సేవలను అభినందించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీధర్ రావు, సూర్యనారాయణ, జి. ప్రసాద్, రమేష్, కెవి రావు, సాయి సతీష్,మల్లయ్య పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్ ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ

జూబ్లీహిల్స్, జనవరి 23, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ అయిన ఘటన వెలుగుచూసింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-2లో నివసిస్తున్న ఎస్ఎల్ఎస్ మహిత తన ఇంట్లో వార్డ్రోబ్‌లోని పౌచ్‌లో ఉంచిన సుమారు 430 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమైనట్లు ఫిర్యాదు చేశారు. నవంబర్ 5న సత్యనారాయణ వ్రతం సందర్భంగా చివరిసారిగా ఆభరణాలను చూసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 10న ప్రయాణానికి వెళ్లే సమయంలో పౌచ్ కనిపించకపోవడంతో ఇంట్లోనే ఎక్కడో ఉంచి ఉండవచ్చని భావించి పండుగకు తన సొంత ఊరికి వెళ్ళింది. జనవరి 17న తిరిగి వచ్చి వెతికినా ఆభరణాలు లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. చోరీ అయిన ఆభరణాల విలువ సుమారు రూ.8.6 లక్షలుగా ఉంటుందని పేర్కొన్నారు.కుటుంబ సభ్యులతో పాటు, ఇంట్లో పని మనిషికి బెడ్‌రూమ్‌లో ప్రవేశం ఉన్నట్లు పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు కిలోల గంజాయి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

ఎల్.బి.నగర్, జనవరి 23 ప్రభాతవార్త: రెండు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులకు సుమారు 5 కిలోల గంజాయి పట్టుబడింది. మీర్‌పేట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి పట్టుబడింది. ప్రొవిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టరు ఎన్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ స్టేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మీర్‌పేట్ అధికారులు, సిబ్బంది 1.2 కిలోల గంజాయి పట్టుకున్నారు. అదేవిధంగా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీకేఆర్ కళాశాల సమీపంలోని బస్‌స్టాప్ వద్ద సరూర్నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిటిఎఫ్ అధికారులు 3.75 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిటిఎఫ్ సరూర్నగర్ ఇన్స్పెక్టర్ టి.సత్యనారాయణ, ఎస్సైలు బి.శంకర, ఫయాజ్ సామజ, కృష్ణయ్యగౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడారంలో నిజాంపేట్ ప్రజాప్రతినిధుల పూజలు



మేడారం జాతరలో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్, జనవరి 23, ప్రభాతవార్త

మేడారం జాతరలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసి) పరిధిలోని పలువురు కీలక నేతలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, నియోజకవర్గ ప్రజల క్షేమం కోరుతూ వారు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, కోలన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసి) బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, ఆవుల జగన్ యాదవ్, రమేష్ యాదవ్, నాచారం మురళి యాదవ్, నాయకులు నాగరాజు యాదవ్ ప్రదీప్, వ్యాపారవేత్తలు శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాజమోహన్ రెడ్డి, హరి నారాయణలు అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి దర్శించుకున్నారు.

ఓటు ప్రతి పౌరుని సామాజిక బాధ్యత

: డిప్యూటీ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి

ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కొంపల్లి, జనవరి 23, ప్రభాతవార్త

ఓటు ప్రతి పౌరుని సామాజిక బాధ్యత, దేశ భవిష్యత్తును నిర్ణయించేది మనం వేసే ఓటేనని డిప్యూటీ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్, మేడ్చల్ కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా కొంపల్లి సర్కిల్ 56, ఆఫీస్ ఆవరణలో ఓటర్ ప్రతిజ్ఞ కార్యక్రమం డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అని పేర్కొన్నారు. ఎలాంటి భయం ప్రలోభం లేదా ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఓటు వేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ మెయింటెనెన్స్ డి విరాట్ రాజ్, ఏఎంసి శ్రీనివాస్ గౌడ్, ఏఈఈ ఎస్డబ్ల్యూఎం కృప, ఏఈఈ మెయింటెనెన్స్ కీర్తి రెడ్డి, ఆఫీస్ సిబ్బంది, ఆర్పీలు పాల్గొని జాతీయ ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని డిప్యూటీ కమిషనర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

గాజులరామారంలో అంగరంగ వైభవంగా చిత్తారమ్మ దేవి జాతర

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జీడిమెట్ల, జనవరి 23, ప్రభాతవార్త

వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భాజా భజంత్రీల నడుమ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో చిత్తారమ్మ దేవి జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెలసిన చిత్తారమ్మ దేవి జాతర ఈ నెల 23 నుండి అంగరంగ వైభవంగా జరగనుంది. 25న ఆదివారం మహా జాతరలో వేలాది మంది భక్తులు తరలి రానుండడంతో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలీస్ శాఖతోపాటు జిహెచ్ఎంసి అధికారులు ఈ జాతరలో పాల్గొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపడుతున్నారు.

యువత క్రీడలలో తమ ప్రతిభను ప్రదర్శించాలి

-మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు భరత్‌గౌడ్

జింఖానాలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు భరత్‌గౌడ్.కార్పోరేటర్ చీరె తదితరులు.

బేగంపేట జనవరి 23,ప్రభాతవార్త

యువత క్రీడలలో తమ ప్రతిభను ప్రదర్శించాలని మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు భరత్‌గౌడ్ పిలుపు నిచ్చారు. ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు,కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా పోటీలను భరత్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని,వారికి నచ్చిన క్రీడలలో ప్రతిభను ప్రదర్శించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా వాలీబాల్,కబడ్డీ,ఖోఖో,క్రికెట్ పోటీలను భరత్‌గౌడ్ టాస్ వేసి ప్రారంభించారు.క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి జట్టుకు సర్టిఫికెట్‌తో పాటు మెమెంటోను కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ తో కల్సి క్రీడాకారులకు అందించారు.ప్రతి టీంకు క్రికెట్ కిట్ అందించారు.ఈ కార్యక్రమంలో మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్(నందూ),చీరె సత్యనారాయణ,బీజేపీ నాయకులు, కార్యకర్తలు,క్రీడాకారులు పాల్గొన్నారు.

సుల్తాన్‌షాహిలో ఘనంగా నేతాజీ జయంతి

సుల్తాన్‌షాహిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చాంద్రాయణగుట్ట, జనవరి 23, ప్రభాతవార్త : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని శుక్రవారం మొఘల్‌పురా డివిజన్ బిజెపి అధ్యక్షులు కె.భగవతి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సుల్తాన్ షాహిలోని నేతాజీ విగ్రహానికి మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీను తదితర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పా శం సురేందర్, నేతలు ఎం. కుమార్, చేతన్ కుమార్ సూరి, పి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంత్రి బందువంటూ ఓ ఘనుడి వసూళ్ళ లీలలు

-కీలక కొలువులో ఉన్న అధికారి అవినీతి దందా...! -అవినీతి అడ్డాగా కూకట్‌పల్లి సబ్ రిజిస్టార్ ఆఫీసు

కూకట్‌పల్లి జోన్‌ప్రతినిధి జనవరి 23ప్రభాతవార్త: కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి, అక్రమ వసూళ్ళలో రికార్డు సృష్టిస్తోంది. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి ఓ జిల్లాకు చెందిన మంత్రి తన బందువంటూ చెప్పుకుంటూ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని అక్రమ వసూళ్ళ కేంద్రంగా మార్చి పైల్‌కో రేటు ఉన్నతాధికారులకు సపరేట్ అని రేట్ కట్టి తన వసూళ్ళ దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా మంత్రి పేరును బూచిగా చూపి బడా బిల్దర్లతోపాటు రిజిస్ట్రేషన్‌కి వచ్చే వారి వద్ద బిల్డప్ ఇస్తూ పెద్ద మొత్తంలో ముడుపులు ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఏదో ఒక లోపాన్ని చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేయకుండా చేసినా పైళ్ళను సకాలంలో ఇవ్వకుండా పగలే చుక్కల్ని చూపిస్తున్నట్లు సదరు అధికారిపై ఆరోపణలు ఉన్నాయి. కూకట్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ అక్రమార్కుడు ఇంత బరితెగించి వసూళ్ళకు పాల్పడుతున్నా అటు అవినీతి నిరోధక శాఖతోపాటు ఇటు ఐజి కార్యాలయం అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అవినీతిలో అరితేరిన కొందరు ఎంత తెలివిగా వ్యవహరిస్తున్నారంటే తమ తప్పులు అక్రమాలు బయట పడకుండా బ్రోకర్లు, కార్యాలయ సిబ్బందితో తమ అక్రమ వసూళ్ళ దందాను చేపిస్తున్నట్లు తెలిసింది. మామూళ్ళ కోసం రిజిస్ట్రేషన్ అధికారులు ప్రజల్ని జలగల్లా పీడిస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ అవినీతి నిరోధక శాఖతోపాటు ఐజి కార్యాలయం ఉన్నతాధికారులు ఎందుకు దృష్టిసారించడం లేదని పలువురు కోరుతున్నారు. ఓ వైపు రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ కార్యాలయం

ఐజి కార్యాలయం అధికారులు ఇస్తున్న ఆదేశాల్ని ఈ కార్యాలయంలో ఎవరూ పట్టించుకోవడంలేదు. గతంలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేసినా తర్వాత ఏ మాత్రం మార్పు లేకపోగా మరింత అక్రమ వసూళ్ళ దందా కొనసాగుతుంది. ఈ వసూళ్ళను నేరుగా కాకుండా బ్రోకర్లతో చేయిస్తూ ఏసీబీకి దొరక్కుండా కొందరు జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. ఏసీబీ అధికారుల నిఘా లేకపోవడంతో అధికారులకు భయం లేకుండా పోయింది. ప్రతి లావాదేవీ వెనుక ఖచ్చితమైన రేట్లు అమలులో ఉన్నాయి. లంచాలు ఇస్తే సంరే లేకుంటే ఏవోవో సాకులు చూపిస్తూ రిజిస్ట్రేషన్లు చేయడంలేదు. స్థిర చర ఆస్తులను అమ్మినా కొనుగోలు చేసినా అధికారుల చేతులు తడపాల్సిందే. బ్రోకర్లు, కార్యాలయంలో వాటాలు పంచుతున్నారు. అధికారులు నేరుగా డబ్బులు తీసుకుంటే ఏసీబీకి అడ్డంగా బుక్ అవుతామని వీరి ద్వారా వ్యవహరాలు చక్కపెడుతున్నారు. ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఎక్కువ కొనుగోలు, అమ్మకాలు జరుగుతుండడంతో రిజిష్రన్‌కి వచ్చే వారి తాకిడి అధికంగా ఉంటుంది. మామూళ్ళు ఇచ్చే స్తోమత లేక పనులు జరుగని వారు అనేక అవస్థలకు గురవుతున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ఆస్తి విలువనుబట్టి లంచాలు డిమాండ్ చేస్తున్నారు. వివిధ రిజిస్ట్రేషన్లకు గాను నిత్యం లక్షలాది రూపాయల మామూళ్ళు వస్తున్నాయి. ఈ కార్యాలయంలో బ్రోకర్లదే హవా, వారిని సంప్రదించకుండా నేరుగా అధికారుల వద్దకు వెళితే పనులు కావడంలేదు. ఎవరిని సంప్రదిస్తే పని జరుగుతుందో కూడా కార్యాలయ అధికారులు చెబుతారు. ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో కొందరు మామూళ్ళ కోసం రిజి స్ట్రేషన్ కోసం వచ్చే వారిని తమ చుట్టూ తిప్పుకుంటున్నారు. లంచాలు ఇస్తే సరే లేదంటే ఏవేవో సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లుచేయడంలేదు. ఒక్క డాక్యుమెంట్ పని పూర్తయి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి వేలకు వేలు. లక్షలాది రూపాయలు లంచాలు ఇవ్వాల్సి వస్తుదంటే ఎంతగా ఇక్కడ అవినీతి పేరుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇల్లు, ప్లాటు, ఫ్లాటు , భూమి కొనుగోలు రిజిస్ట్రేషన్ల కు పెద్ద మొత్తంలో మామూళ్ళు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు చెల్లించని వారిని డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. అయితే బ్రోకర్లతో డబ్బులు వసూలు చేయిస్తూ తాము ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయడంలేదని తెలివిగా చెబుతున్నారు. ఈ అవినీతి తతంగమంతా బయట ప్రైవేట్ వ్యక్తులు, బ్రోకర్లుకొందరు సన్నిహితులైన వ్యక్తులతో జరుగుతుందనేది వాస్తవం. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తి విలువను బట్టి లంచాల డిమాండ్ వుంది

ప్రతి ఒక వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

బేగంబజార్,జనవరి 23ప్రభాతవార్త: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతపై వాహనదారులకు,పుట్‌పాత్ వ్యాపారులకు అవగాహన కల్పించారు.శుక్రవారం కోఠి ఆంధ్రాబ్యాంకు చౌరస్తా వద్ద ట్రాఫిక్ అడ్మిన్ ఎసిపి లక్ష్మన్,బేగంపేట టి.టి.ఐ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్,సుల్తాన్ బజార్ ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు,వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ అడ్మిన్ ఎ.సి.పి లక్ష్మన్ మాట్లాడుతూ నగరంలోని పుట్‌పాత్‌లను అక్రమించి ట్రాఫిక్ అంతరాయం కలిగించరాదన్నారు.రోడ్డుపై భద్రతతోపాటు ఇతరుల భద్రత కోసం ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాల్సిన అవశ్యకత గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు.బేగంపేట టి.టి.ఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ..మధ్యంసేవించి వాహనం,నడపడం,మొబైల్,ఫోన్ వినియోగం ,రాంగ్‌రూట్, డ్రైవింగ్ రెడ్ సిగ్నల్ జంపింగ్,అతివేగం,ట్రిపుల్‌రైడ్ మానుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఎస్.ఐ జి.నిరంజన్,సిబ్బంది,టి.టి.ఐ బేగంపేట్ సిబ్బంది సాయికుమార్,కృష్ణ చిరువ్యాపారులు పాల్గొన్నారు.

కోఠి ఆంధ్రాబ్యాంకు చౌరస్తా వద్ద వాహనదారునికి గులాబి పువ్వును అందచేస్తున్న ట్రాఫిక్ ఎసిపి లక్ష్మన్,ట్రాఫిక్ పోలీసు అధికారులు

అక్షర తపస్విలోని కవితలు రఘురామ్ సాహిత్య మణిపూసలు : డా. కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, జనవరి 23 ప్రభాతవార్త : అక్షర తపస్వి కవితా సంపుటిలోని ఆణిముత్యాల్లాంటి కవితలు, అంత్య ప్రాసలు రచయిత రఘురామ్ సాహిత్య మణిపూసలని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. కిన్నెర ఒక సారస్వత సాంస్కృతిక సంస్థ అని, సంస్థ కార్యదర్శిగా తన పేరునే మార్చుకున్న కిన్నెర రఘురామ్‌గా గొప్పగా చేస్తున్న కవితా రచనలతో ఈ ఉగాది నుండి కవి రఘురామ్‌గా రూపొంది పరిగణింపబడాలని ఆకాంక్షించారు. ప్రతీనెల మొదటి, మూడో శనివారాల్లో జరుపుతూ అందులో భాగంగా అక్షర తపస్వి కవితా సంపుటిని ఆవిష్కరింపజేసిన సంకల్పం శ్లాఘనీయమని, సంకల్ప శుద్ధి ఉండే సంకల్పసిద్ధి కూడా ఉంటుందని కార్యదర్శి డా. నామోజు బాలాచారిని అభినందించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. ఏనుగు నరసింహారెడ్డి, గౌరవ అతిథులు డా. ఓలేటి పార్వతీశం, జి.వల్లీశ్వర్, కృతిస్వీకర్త పి.వి.చలం, తొలిప్రతి స్వీకర్త ఎ.ఆర్.కె.నియోగి తదితరులతో కలిసి కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ రచించిన అక్షర తపస్వి కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం రచయిత ఎం.రఘురామ్ ఎ.ఆర్.కె.నియోగిని ఘనంగా సత్కరించి తొలిప్రతిని, పి.వి.చలంను ఘనంగా సన్మానించి అక్షరతపస్విని అంకితమిచ్చారు. తదుపరి తెలంగాణ సాహిత్య అకాడమీ అతిథుల చేతులమీదుగా రచయిత కిన్నెర రఘురామ్‌ను ఘనంగా సత్కరింపజేశారు.

అక్షరతపస్వి కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న రమణాచారి, బాలాచారి, నరసింహారెడ్డి, పార్వతీశం, రఘురామ్, వల్లీశ్వర్ తదితర అతిథులు

బిజెపి ఆధ్వర్యంలో రైతుల సమావేశం

దుండిగల్, జనవరి 23, ప్రభాతవార్త

దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై బౌరంపేట్‌లో శుక్రవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హర్యానా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంచాయతీ నుండి జిహెచ్ఎంసిలో విలీనమైన తర్వాత కన్జర్వేషన్ జోన్లు రైతులకు శాపంగా మారిందని మల్టిజోన్ మార్చే వరకు మీ వెంటే నేనుంటా అని భరోసా ఇవ్వడం జరిగింది. సామాన్య సన్న చిన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు, వారికి జరిగే నష్టం అపారమైనదని, రైతుల నుండి ముఖ్యమంత్రికి ఇవ్వడానికి వినతి పత్రాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం తర్వాత త్వరలో ముఖ్యమంత్రిని వివిధ సమస్యలపైన కలిసి విన్నవించి కచ్చితమైన పరిష్కారం కోరుతానని, వాళ్ళు స్పందించని యెడల 50 వేల మందితో ఉద్యమ రూపంలో కూడా ప్రభుత్వాన్ని మెడలు వంచి సాధించుకుందాం అని రైతులకు సూచించారు. 70 ఏండ్ల నుండి వాళ్ళ అధీనంలో ఉన్న లావణ్య పట్టాలు, ఔటర్ రింగ్ రోడ్డు సొంత పొలంలో నుండి వెళ్లినా కానీ వారి పొలంలోకి దారి ఇవ్వకుండా హెచ్ ఎండి అధికారుల దారిని తొలగించడంపై స్పందించి వివరించడం జరిగింది. అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం బీజేపీ జిల్లా ఇంచార్జి అధ్యక్షులు బౌరంపేట్ మాజీ సర్పంచ్‌లు డా ఎస్ మల్లారెడ్డి, అర్గుల వీరేశం గౌడ్, కొమ్ము మంగమ్మ, మాజీ ఎంపీటీసీలు ఎస్ జంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వర్ చారీ, సీనియర్ నాయకులు నల్ల రామచంద్రరెడ్డి, డి ప్రభాకర్ రెడ్డి, సరిగారీ సత్తిరెడ్డి,ఆకుల సత్యనారాయణ, పి మాధవరెడ్డి, ఆకుల మల్లేష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు దమ్మగారి సీతారాంరెడ్డి, తురాయి భానుగౌడ్, నాయకులు ఆర్ నర్సింహా చారి, ఆకుల విజయ్, యశ్వంత్, చిన్న, తలారి రాజ్ కుమార్, నామాల శ్రీకాంత్, విష్ణు తదితరులు నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దత్తాత్రేయ

సమన్వయంతో అధికారులు పనులు చేయాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త

నల్లకుంట డివిజన్‌లో శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ వై.అమృతతో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో 28లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులను చేపట్టారు. అంతకు ముందు, అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్లు వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. వారి సమస్యలను తెలుసుకొని అధికారులకు తగు సూచనలు అందజేస్తూ వేగవంతంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సంజీవయ్య నగర్ బస్తీలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పిస్తామని హామీ ఇచ్చారు. చేపడుతున్న అభివృద్ధి పనులను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారిపట్ల చర్యలు తప్పవన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు నెలకొన్న నేరుగా తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈ ఈ ప్రవీణ్ కుమార్, ఏఈ రోహిత్, ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర స్థానిక నాయకులు, బిజెపి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

నల్లకుంటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ వై.అమృత

నిమ్స్‌లో చికిత్సకు ఎన్‌వోసీ..

కాచిగూడ డివిజన్ మోతిమార్కెట్‌కు చెందిన వేణుకు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహాయ సహకారాలు అందించారు. ఆస్పత్రి చికిత్స కోసం అయ్యే వైద్య ఖర్చుల కోసం ఆయన సిఎంఆర్ఎఫ్ ద్వారా లక్ష విలువగల ఎన్‌వోసీ రోగి కుటుంబానికి అందజేశారు.పేద, మధ్యతరగతి వర్గాలకు ఖరీదైన వైద్యసహాయం కోసం ఎన్‌వోసీ అందజేసినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు.

సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా బొజ్జయ్య

హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త

సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది ఎన్.బొజ్జయ్య (గణేష్) నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాద వృత్తిలో ఆయన అందించిన సేవలకు గుర్తింపు లభించిందని, సివిల్, క్రిమినల్ కేసులలో ప్రభుత్వం తరపున కోర్టులో సమర్థవంతంగా ప్రాతినిధ్యం వహిస్తారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులైన సందర్భంగా బొజ్జయ్యను ఆయన సహచరులు ఘనంగా సన్మానించారు.ఆయనను కలిసిన వారిలో శేఖర్, శ్రీనివాస్,వెంకటేష్ ,తదితరులు ఉన్నారు.

25న ఉచిత వైద్య శిబిరం...

కూకట్‌పల్లి, జనవరి 23, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్‌లో ఈనెల 25న హోమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు అంబటి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అమోర్ ఆసుపత్రి, ఆరాధ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో మున్సిపల్ సర్కిల్ కార్యాలయం దగ్గర ఆదివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య శిబిరం జరుగుతోందని తెలియజేశారు. బిపి షుగరు ఈసీజీ కంటి దంత వైద్య పరీక్షలతోపాటు జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాల్సిందిగా అంబటి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేకే అక్రమ నోటీసులు

: మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

దుండిగల్, జనవరి 23, ప్రభాతవార్త

బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేకే ఈ అక్రమ నోటీసులు అని మాజీ కౌన్సిలర్ నర్సా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనా వైఫల్యం, వరుస స్కాంల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే సిట్ నోటీసులు అంటూ, అనవసర విచారణలు చేస్తుందని, సింగరేణిలో జరిగిన బొగ్గు స్కామ్ గురించి దేశమంతా చర్చనీయం కావడంతో నిజాలు బయటకు వస్తాయేమో అని భయపడి సిట్ విచారణ అంటూ కాలక్షేపం చేస్తుందని అన్నారు. ఇది రాజకీయంగా ఎదుర్కోలేక కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమేనని, ఇది డైవర్షన్ పాలిటిక్స్ విచారణ మాత్రమే కానీ కేసులో ఏం పస లేదన్నారు. మీరు ఎన్ని నోటీసులు ఇచ్చిన, ఎన్ని విచారణలు చేసిన మా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారని, వారికి మేము, మా కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.

ప్రిన్సిపల్‌కు రెండేళ్ల జైలు శిక్ష

అత్తాపూర్ జనవరి23,ప్రభాతవార్త : విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపల్‌కు రాజేంద్రనగర్ కోర్టు జడ్జిపి. ఆంజనేయులు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్రెడ్డి వివరాల మేరకు... కూకట్‌పల్లిలో ఉండే ముకేష్ రెడ్డి(30) మియాపూర్‌లో ఓ జూనియర్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. అదే కళాశాలలో ఓ బాలిక (16) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. 2019 నవంబరు 8వ తేదీన సాయంత్రం విద్యార్థులు చదువుకునే సమయంలో ముకేష్ రెడ్డి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు.విద్యార్థులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకుపోగా మియాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రిన్సిపల్‌ను అరెస్టు చేశారు. దీనిపై వాదనలు పూర్తి కావడంతో ముకేష్ రెడ్డికి న్యాయస్థానం దోషిగా తేల్చింది. రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

నిబంధనలు పాటిద్దాం... ప్రమాదాలను నివారిద్దాం...

- నార్సింగి ట్రాఫిక్ ఆర్.ఐ ప్రదీప్

తప్పిపోయిన వృద్ధురాలిని అప్పగించిన పోలీసులు

తప్పిపోయిన వృద్ధురాలు సురయాను ఆమె మనవడికి అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చాంద్రాయణగుట్ట, జనవరి 23, ప్రభాతవార్త : ముదిమి వయస్సులో దారి తప్పిన ఒక వృద్ధురాలిని ఫలక్‌నుమా పోలీసులు క్షేమంగా వెతికిపట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో డైల్ 100 నుండి ఫోన్‌కాల్ వచ్చింది. ఫలక్‌నుమా వట్టేపల్లి ప్రాంతంలో 65 ఏళ్ళ సురయా అనే వృద్ధురాలు తప్పిపోయినట్లు సమాచారం అందింది. అప్రమత్తమైన ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య వెంటనే పెట్రోలింగ్ సిబ్బందిని రంగంలోకి దించారు. మరోవైపు వృద్ధురాలి ఫోటో, వివరాలను పోలీసు గ్రూపులో వైరల్ చేశారు. రాత్రి 9గంటల ప్రాంతంలో నైస్ హోటల్ ప్రాంతంలో సంచరిస్తున్న సురయాను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. తగిన సేవలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ముహమ్మదియా కాలనీకి చెందిన ఆమె మనవడు, వడ్రంగం పనిచేసే మహ్మద్ సికిందర్ తగిన ఆధారాలతో పోలీసులను ఆశ్రయించారు. అతడు చూపిన ఆధారాలతో సంతృప్తి చెందిన పోలీసులు వృద్ధురాలు సురయాను క్షేమంగా అప్పగించారు. అందుకు ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐక్యతతో ముందుకు సాగుతున్నాం

జాతీయ మహాసభలకు హాజరైన టి.ఎన్.జి.ఓ. కేంద్రసంఘం, జిల్లా టిఎన్‌జి ప్రతినిధి బృందం

గన్‌ఫౌండ్రి, జనవరి 23ప్రభాతవార్త: మహారాష్ట్రలోని షీర్డిలో నిర్వహిస్తున్న ఆల్‌ఇండియా స్టేట్ గవర్నమెంట్‌ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మహాసభలకు తెలంగాణ టి.ఎన్.జి.ఓ కేంద్ర సంఘం, హైదరాబాద్ జిల్లా టి,ఎన్.జి.ఓ ప్రతినిధి బృందం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా టి.ఎన్.జి.ఓ అధ్యక్షులు విక్రమ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, ఇ.ఎన్.టి ఆసుపత్రి యూనిట్ అధ్యక్షులు తూముకుంట రాజు, సుధాకర్‌రెడ్డి ప్రతినిధులుగా సదస్సులో పాల్గొన్నారు. మహాసభల్లో పాల్గొన్నటిఎన్‌జిఓ కేంద్ర సంఘం అధ్యక్షులు, ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్ వైస్ చైర్మన్ మారం జగదీశ్వర్‌ని హైదరాబాద్ టిఎన్‌జిఓ ప్రతినిధి బృందం కలిసి హైదరాబాద్‌లోని ఉద్యోగులు, ఎదుర్కొంటున్న వివిధ గ్రీవెన్స్‌లను, పదోన్నతుల్లో జాప్యాన్ని, ఇతర పరిపాలనా పరమైన ఇబ్బందులను మహాసభలో విన్నవించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహాసభకు వచ్చిన ఉద్యోగ సంఘాల నేతలతో వారు సంభాషించి ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారం మార్గాలపై చర్చించినట్లు వారు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం శుభసూచకం: కార్పొరేటర్

యుజిడి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, జనవరి 23 ప్రభాతవార్త: అభివృద్ధిలో ప్రజలు బాగస్వామ్యం అవసరమని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎంఇఎస్ కాలనీ వాసులు తమ సొంత నిధులు 32లక్షలు వ్యయంతో ఏర్పాటు చేసుకోనున్న యుజిడి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీ వాసులు అభివృద్ధిలో పాల పంచుకోవడం మంచి పరిణామమని జితేందర్ నాథ్ పేర్కొన్నారు. యుజిడి పనులు పూర్తి చేసిన వెంటనే సిసి రోడ్లు ఇతర సమస్యలను తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బొబ్బిలి సురేందర్ రెడ్డి, లడ్డు, శ్రీశైలం యాదవ్, దిడ్ల స్వామి, నవీన్ పాల్గొన్నారు.

నాలా ఆక్రమణలు తొలగించండి .. హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

రంగనాథ్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

అల్వాల్, జనవరి 23 ప్రభాతవార్త: నాలా ఆక్రమణలను తొలగించాలని కోరుతూ హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు బిఆర్ఎస్ నేతలు వినతి పత్రం అందించారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్, ఇందిరానగర్‌లో నాలాలు, వరద నీటి కాలువలపై నిర్మించిన వాటిని తక్షణం తొలగించాలని వారు కమీషనర్‌ను కోరారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ నిర్మాణాలు కారణంగా ప్రజలు వరద ముంపుకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, మోసిన్, విజయ్ శేఖర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి అనేది విద్య, విజ్ఞానం, సంస్కృతికి ప్రతీక

..గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి

చిక్కడపల్లి జనవరి 23 (ప్రభాతవార్త) : అశోక్ నగర్ నగర కేంద్రం గ్రంథాలయంలో శుక్రవారం వసంత పంచమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానదేవత సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసంగించారు. వసంత పంచమి అనేది విద్య, విజ్ఞానం, సంస్కృతికి ప్రతీకగా నిలిచే గొప్ప పర్వదినమని ఆయన కొనియాడారు. సమాజ అభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు, పాఠకుల విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు నిరంతరం సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ పాల్గొని సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలో ప్రథమ శ్రేణి గ్రంథ పాలకురాలు చంద్రకళ, ప్రతిభారెడ్డితో పాటు ఉద్యోగులు అవినాష్, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, రామ్మోహన్, మహేందర్, పిడి మహేష్, అనిల్, అశోక్ మరియు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మహేశ్వరి, అమరావతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అనుమానాస్పదస్థితిలో సంచరిస్తున్న యువకుడికి జైలు

చాంద్రాయణగుట్ట, జనవరి 23, ప్రభాతవార్త : చీకట్లో అనుమానాస్పదస్థితిలో తచ్చాడుతున్న ఒక యువకుడికి కోర్టు ఏడు రోజుల జైలుశిక్ష విధించింది. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ కథనం ప్రకారం బండ్లగూడ నూరీనగర్ నివాసి, ఏసీ టెక్నీషియన్ సయ్యద్ అబ్దుల్ రహమాన్ అలీ (19) చీకటి ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. ఇది గమనించిన పోలీసులు అతని ప్రశ్నిస్తే పారి పోయాడు. పోలీసులు అలీని పట్టుకొని ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని 9వ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కోర్టు అతనికి ఏడు రోజుల జైలుశిక్ష విధించింది. దీంతో పోలీసులు అతనిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యవసాయం, ఉద్యానవన, అటవీ ఔషధ రంగాలలో విప్లవాత్మక మార్పులు

చిక్కడపల్లి జనవరి 23 (ప్రభాతవార్త): దేశంలో సాంకేతిక పరంగా వ్యవసాయం, ఉద్యానవన, అటవీ ఔషధ రంగాలలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉందని వీరనారి చకలి ఇల్లమ్మ మహిళా విశ్వవిద్యాలయం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి.ఆర్. సుష్మ అన్నారు. శుక్రవారం బాగ్ లింగంపల్లి డా. బి.ఆర్. అంబేద్కర్ ఆటోనమస్ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో ప్లాంట్ టిష్యూ కల్చర్ భవిష్యత్ అవకాశాలు" "పై ప్రొఫెసర్ డా. పి.ఆర్. సుష్మ ప్రసంగించారు. ప్లాంట్ టిష్యూ కల్చర్, మోలిక సూత్రాలు, వివిధ సాంకేతిక పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ రంగంలో ఉన్న భవిష్యత్ పరిశోధన అవకాశాల గురించి వివరిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. మట్టా శేఖర్ ప్రసంగిస్తూ, విద్యార్థులు ఇటువంటి అకడమిక్ సెషన్లను సద్వినియోగం చేసుకో

ప్రసంగిస్తున్న వీరనారి చకలి ఇల్లమ్మ మహిళా విశ్వవిద్యాలయం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి.ఆర్. సుష్మ

వాలని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నిరంతరం మారుతున్న సాంకేతికతపై అవగాహన పెంచుకోవడం ద్వారానే ఉత్తమ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. చర్చా కార్యక్రమంలో విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఫిబ్రవరి 25న ఒసి కమిషన్ సాధన కోసం ఢిల్లీలో 'మహాదీక్ష'

సైఫాబాద్, జనవరి 23 ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో ఓసిల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఓసి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' పేరిట ఫిబ్రవరి 25న జంతర్‌మంతర్ వద్ద వేలాది మందితో మహాదీక్ష చేపడుతున్నామని తెలంగాణ ఓసి సంక్షేమ సంఘం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏనుగు సంతోష్‌రెడ్డి, కాచం సత్యనారాయణగుప్తా తదితరులు మహాదీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాదీక్షకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది పాల్గొంటారని తెలిపారు. ప్రతి రైతు పేద కుటుంబాలకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో కూడిన విద్య, నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలని, కులాలకు అతీతంగా విద్యా, ఉద్యోగాల్లో ఆర్థిక పరమైన రిజర్వేషన్‌లు కల్పించి క్రీమిలేయర్ పద్ధతిని తీసుకురావాలని, ఓసి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంతోష్‌రెడ్డి, సత్యనారాయణగుప్తా తదితరులు

అభ్యర్థులకు అన్ని పోటీ పరీక్షల్లో అర్హత మార్కులు తగ్గించాలని, ఓసిల సర్టిఫికేట్ల కాల పరిమితిని 5 సంవత్సరాలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఓసిల రిజర్వేషన్‌లపై కొంత మంది తప్పుడు ప్రచారాలు చేస్తూ, అవమానపరుస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో మరోక సారి చేస్తే సహించేది లేదని, తీవ్రంగా ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ కుల సంఘాల నాయకులు పోచంపల్లి రమణారావు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించనపుడే ప్రమాదాలకు అడ్డుకట్ట

ఆర్టీఎ సభ్యులు సురేష్ లాల్‌ను సన్మానిస్తున్న ఆర్టీఓ కృష్ణయ్య, అధికారులు

చాంద్రాయణగుట్ట, జనవరి 23, ప్రభాతవార్త : రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని ఆర్‌టీఏ సభ్యులు సురేష్ లాల్ కోరారు. పాతబస్తీ బండ్లగూడ దక్షిణ మండలం రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు, నియమాలు పాటించటం వల్ల రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. దక్షిణ మండల ఆర్‌టీఓ కృష్ణయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినపుడు గుండె పని చేయకపోతే సీపీఆర్ ఎలా చేయాలో తెలుసుకొని ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను విధిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

త్యాగరాజు ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

జూబ్లీహిల్స్, జనవరి 23, ప్రభాతవార్త: బషీర్‌బాగ్‌లోని రాజాజీ సభాగృహంలో శుక్రవారం త్యాగరాజ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీయ విద్యాభవన్‌కు చెందిన ఐదు పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది సంయుక్తంగా పాల్గొని శ్రీ త్యాగరాజ స్వామికి ఘన నివాళులర్పించారు. ఉంచవృత్తితో కార్యక్రమం ప్రారంభమై, చైర్మన్ ఎస్. గోపాలకృష్ణ ఐఏఎస్, అకడమిక్ డైరెక్టర్ రమాదేవి తదితరులు దీప ప్రజ్వలన చేశారు. పంచరత్న కీర్తనల ఏకస్వర గానం సభను ఆధ్యాత్మిక వాతావరణంతో నింపింది. "నగుమోము గలవాని" కీర్తన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం ముగింపులో చైర్మన్ అందరి కృషిని అభినందించి, విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు.

మైసమ్మగూడలో పంచాయతీ పెద్దపై కత్తితో దాడి

ఆస్తి వివాదమే కారణం.. పరిస్థితి విషమం

పేట్ బషీరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త

మైసమ్మగూడ ప్రాంతంలో ఆస్తి వివాదం నేపథ్యంలో పంచాయతీ పెద్దపై కత్తితో దాడి జరిగిన ఘటన శుక్రవారం ఉదయం కలకలం రేపింది. ఈ దాడిలో మైసమ్మగూడకు చెందిన చింత శంకరయ్య (56) తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మైసమ్మగూడకు చెందిన చింత రవి (32)కి శంకరయ్య బాబాయ్ అవుతాడు. రవి, అతని సోదరుడు రాజు మధ్య కొంతకాలంగా ఆస్తి వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదంలో శంకరయ్య పంచాయతీ పెద్దగా వ్యవహరిస్తూ రాజు పక్షాన నిలబడి మద్దతు ఇచ్చాడు. ఈ విషయంపై కోపంగా ఉన్న రవి, శుక్రవారం ఉదయం సుమారు 11:30 గంటల నుంచి 11:50 గంటల మధ్యలో మైసమ్మగూడలోని ఒక టీ షాప్ వద్ద శంకరయ్య కూర్చొని ఉండగా, రవి అకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో శంకరయ్య కడుపు, గొంతు, ఎడమ చెవి, ముఖంపై గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శంకరయ్యను వెంటనే నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

చార్మినార్, జనవరి 23 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంతో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. లక్ష్మీగూడ ప్రాంతానికి చెందిన కిష్టమ్మ (70) ఈ నెల 22వ తేదీ గురువారం సాయంత్రం దుర్గానగర్ నుంచి కాటేదాన్ వైపు నడుచుకుంటూ వెళుతున్నది. అదే సమయంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు కిష్టమ్మను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన కిష్టమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

ప్రాణ భిక్ష పెట్టాలని న్యాయవాది వేడుకోలు

సమావేశంలో మాట్లాడుతున్న అశ్విన్‌కుమార్

సైఫాబాద్, జనవరి 23 ప్రభాతవార్త: ఒక వ్యక్తితో తనకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించి ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, మెదక్ జిల్లా ఎస్పీకి సీనియర్ న్యాయవాది విజ్ఞప్తి చేశారు. కోట్లాది రూపాయలు విలువగల అస్తులను దోచుకునేందుకు తన సోదరుడిని దారుణంగా చంపారని, ప్రస్తుతం తనని చంపి ఆస్తులను దోచుకునేందుకే హత్యా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుడి మల్కాపూర్‌కు చెందిన న్యాయవాది దోంతుల అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన 8వ మెట్రోపాలిటన్ నాంపల్లి కోర్టు ఆవరణలో తనను బహిరంగంగా ఒక వ్యక్తి చంపుతానని చెప్పి నోటితో చెప్పడానికి వీలు కాని బూతులు తిట్టారని ఆరోపించారు. ఈ విషయంపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు కేసు నమోదు చేశారే కాని అతనిపైన ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తానే అనుకొని నాసోదరుడిని సుపారి గ్యాంగ్ గత ఏడాది సెప్టెంబరు దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని తనకు ప్రాణభిక్ష పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ నుతన కార్యవర్గం ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఏర్పాటైన దృశ్యం

చిక్కడపల్లి జనవరి 23 (ప్రభాతవార్త) : తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శ సమక్షం లో ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సింగ రాజు (సిద్దిపేట జిల్లా), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా జీ మల్లేష్(నారాయణ పేట), రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లంముళ్ళ శంభులింగం (నల్లగొండ), గౌరవ అధ్యక్షులుగా ఏ శ్రీరాములు, చేరుకు శ్రీనివాస్, గౌరవ సలహాదారు టి గోపాల్ రెడ్డి ఉపాధ్యక్షులు బోడ్డు క్రిష్ణ , కే రాఘవేంద్ర రెడ్డి, డి వెంకన్న నాయక్ , సహాయ కార్యదర్శు దోమల, ముత్తయ్య, పి అశోక్ , పి నర్సింహా , కోశాధికారి గంప శివకుమార్ ప్రచార కార్యదర్శి ఆకులు శ్రీనివాస్ కమిటీ సభ్యులు కె. శ్రీనివా స్, వెంకన్న లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎన్నికైన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గోపాల మిత్రులు శ్రేయ స్సు కోసం నిరంతరం కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్యను తీర్చాలి : ధర్మారెడ్డి

అత్తాపూర్ జనవరి23, ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిఆర్ఎస్ నాయకుడు పొరెడ్డి ధర్మారెడ్డి జల మండలి అధికారులను కొరారు. శుక్రవారం రాజేంద్రనగర్ లోని కార్యాలయంలో జలమండలి జిఎంను పొరెడ్డి ధర్మారెడ్డి కలిసి తాగునిటీ సమస్యలను వివరించారు. ఉప్పరపల్లి బాంబే కాలనీలో రెండు సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని త్వరగా తాగునీటి సమస్య పరిష్కరించాలని లేకపోతే వచ్చే వేసవిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో కే గిరి బాబు, ఉదయ్ కిరణ్ రెడ్డి, యాదగిరి, అరవింద్ అకిరా నందన్ అలాగే బాంబే కాలనీవాసులు పాల్గొన్నారు .

హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంజిఎన్ఆర్ఈజిపి బచావో సంగ్రామ్ యాత్ర

చార్మినార్, జనవరి 23 ప్రభాతవార్త : కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టంను బలహీన పరిచే, పేరు మార్చే ప్రయత్నాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో జనవరి నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఎంజిఎన్ఆర్ఈజిఏ బచావో సంగ్రామ్ యాత్రను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ యాత్రకు సంబంధించినబ్రోచర్‌ను విడుదల చేశారు. డిసిసి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీలు పులిపాటి రాజేష్ కుమార్, బోయ నరేష్, ముజీబుల్లా ఫరీఫ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు. పాతబస్తీలో నిర్వహిస్తున్న యాత్రకు అనుమతి కోరటంతో యాత్రలో పాల్గొనాలని వారు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా మాట్లాడుతూ రాజ్యాంగ

యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

బద్ధమైన ఉపాధి హక్కును వ్యవస్థాపితంగా కూల్చి వేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జీవనాధారంగా ఉన్న ఎంజిఎన్ఆర్ఈజిఏని మోదీ ప్రభుత్వం ఏ విధంగా బలహీన పరుస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయడమే బచావో సంగ్రామ యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. జనవరి నెల 24వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు యాత్ర చార్మినార్ వద్ద ప్రారంభం అవుతుందని, 26 వతేదీ సోమవారం మలక్‌పేట్ టివి టవర్ వదనద ముగుస్తుందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకుందాం : అల్లం నారాయణ

పేట్ బషీరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త

అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణను మళ్లీ వెనక్కి పోనివ్వబోమని, మన అస్థిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి జర్నలిస్టులు సిద్ధంగా ఉండాలని తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు అల్లం నారాయణ పిలుపునిచ్చారు. హైదరాబాద్ మనదని, తెలంగాణ మనదని స్పష్టం చేస్తూ.. ఇక్కడ మళ్లీ ఆంధ్రా నాయకుల చక్రాలు తిప్పడం సాగదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సూరారంలో టిలిప్ హోటల్ హోటల్‌లో జరిగిన కుత్బుల్లాపూర్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ యూనియన్ కుత్బుల్లాపూర్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారణ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ జాయింట్ ఫోర్స్ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి ప్రదర్శించాల్సిన సమయం వచ్చిందని అల్లం నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్, టెంజు రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణకుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, యూనియన్

మీడియాతో మాట్లాడుతున్న టి.యు.డబ్ల్యూ.జె నాయకులు

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాజీ, ఐజేయు కమిటీ సభ్యులు రంగు వెంకటేష్ గౌడ్, మేడ్చల్ ఇన్చార్జి బొమ్మ అమరేందర్, జిల్లా అధ్యక్షులు కోలా వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలెపాక వెంకట్, కుత్బుల్లాపూర్ మాజీ అధ్యక్షులు సుధీర్ మాంకాల, సీనియర్ జర్నలిస్టులు ముక్కెర్ల లాలయ్య, సిరిగిరి శ్రీనివాస్, లింగస్వామి, రామకృష్ణారెడ్డి, సురేందర్, కుత్బుల్లాపూర్ గౌరవ అధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, అధ్యక్షులు సుగ్రీవుడు, ప్రధానకార్యదర్శిగా మాధవరెడ్డి, కోశాధికారి ఎర్రోళ్ల బాబు, కళ్యాణ్, శోభన్, టెంజు కన్వీనర్ ఎర్రోళ్ల కృష్ణ, కో కన్వీనర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గోవధం, గోవుల అక్రమ రవాణా, స్మగ్లింగ్‌పై నిషేదం విధించాలి : రాజశ్రీ చౌదరి డిమాండ్

సైఫాబాద్, జనవరి 23 ప్రభాతవార్త: భారతదేశాన్ని సంపూర్ణంగా హిందూ దేశంగా నిర్మించాలనే లక్ష్యంతో గోవధం, గోవుల అక్రమ రవాణా, స్మగ్లింగ్‌పై సంపూర్ణంగా నిషేదం విధించాలని అఖిల భారత హిందూ మహాసభ పార్టీ జాతీయ అధ్యక్షురాలు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ముని మనవరాలు రాజశ్రీ చౌదరి డి

ఫ్లైఓవర్ రీ-అలైన్‌మెంట్ అంశంపై సమీక్ష

మల్కాజిగిరి జనవరి23,ప్రభాతవార్త :

జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆర్‌కే పురం ఫ్లైఓవర్ రీ-అలైన్‌మెంట్ అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్‌కే పురం ఫ్లైఓవర్‌ను రీ-అలైన్‌మెంట్ చేయడం వల్ల పరిసర ప్రాంతాలైన పల్లవి విల్లా అపార్ట్‌మెంట్ వాసులు, స్థానిక దుకాణదారులు, అలాగే ఆర్మీ డిఫెన్స్ ల్యాండ్‌లో నివసిస్తున్న పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తగ్గేలా ఫ్లైఓవర్ రీ-అలైన్‌మెంట్ చేపట్టాలని కోరుతూ సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.దీనిపై స్పందించిన జీహెచ్ఎంసి ప్రాజెక్టు అధికారులు, సమస్యను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రోహిణి, డిప్యూటీ ఇంజనీర్ రేణుక, అసిస్టెంట్ ఇంజనీర్‌లు వెంకట్ రెడ్డి, సుజిత్, అలాగే కాలనీ వాసులు బి.టి. శ్రీనివాస్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్

వనస్థలిపురం జనవరి23,ప్రభాతవార్త

బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ సంక్షేమ సంఘం భవనంలో సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సాంక్షన్ అయినందున మరియు కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సాంక్షన్ అయిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. మరియు కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించి, స్థానిక ప్రజల నుంచి ప్రత్యక్షంగా సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన కార్పొరేటర్ , ప్రతి సమస్యను గమనించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని దశలవారీగా పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం రేపు బాలాపూర్ లో జరిగే జాగో భాగ్య నగర్ చలో బాలాపూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాలనీ వాసులకు కరపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్, కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు అప్పారావు, నరసింహారెడ్డి,భరత్ కుమార్, రాంబాబు రామకృష్ణా ప్రభాకరరావు,నారాయణ అన్నపూర్ణ బాలాజి ,ఆరీఫ్ ప్రేమరాజ్, శ్రీ దేవి, గోవర్ధన్ గుప్తా, అరవింద్ గౌడ్, రవీంద్ర నాథ్, ఆగయ్య, మస్తాన్, రామరావు, రాధ కృష్ణ మూర్తి, నాగేశ్వర్ రావు మరియు పార్టీ డివిజన్ సీనియర్ నాయకులు రవిశంకర్,డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, ఎస్సీ మోర్చా సెక్రెటరీ దుర్గాప్రసాద్, సాగర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ రాగుల

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాగుల

వనస్థలిపురం జనవరి23,ప్రభాతవార్త :

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని తిరుమల కాలనీలో డ్రైనేజ్ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాషం అశోక్ గౌడ్ , మల్లికార్జున్ నగర్ కాలనీ అధ్యక్షులు నర్సి రెడ్డి , క్రిస్టిన్ కాలనీ అధ్యక్షులు హరిందర్ రెడ్డి , తిరుమల కాలనీ అధ్యక్షులు రఘువీర రెడ్డి , కార్యదర్శి కృష్ణమాచారి, జాయింట్ సెక్రటరీ రఘునందన్ రెడ్డి తో పాటు పెద్ద సంఖ్యలో కాలనీ నివాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..తిరుమల కాలనీలో డ్రెయినేజ్ సమస్య వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల నేపద్యంలో ఈ పైప్‌లైన్ పనులు చేపట్టామని తెలిపారు ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, నివాస వాతావరణం మెరుగుపడాలనే ఉద్దేశంతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ ప్రాధాన్యత కొనసాగుతుందని కార్పొరేటర్ గారు స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం కాలనీ పెద్దలు మరియు నివాసులు కార్పొరేటర్‌కి కృతజ్ఞతలు తేలిపారు.

బిల్‌షుక్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ టోర్నమెంట్ ప్రారంభం

నమావేశంలో ప్రసంగిస్తున్న బ్యాట్మింటన్ తెలంగాణ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ యు వి ఎన్ బాబు, చిత్రంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి & అసోసియేషన్ చైర్మన్ సామా ప్రభాకర్ రెడ్డి, కారేడ్ల శ్రీనివాసరావు తదితరులు

మలక్ పేట, జనవరి 23, ప్రభాతవార్త:

దిల్ షుక్ నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్బిహెచ్ కాలనీ జిహెచ్ఎంసి గ్రౌండ్స్ లోచేపట్టిన 21వ ఇన్విటేషన్ రిపబ్లిక్ డే బ్యాట్మింటన్ టోర్నమెంటును శుక్రవారం మూసారం బాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాదులు వేస్తాయన్నారు. క్రీడల వలన చురుకుదనం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయన్నారు. అదేవిధంగా తెలంగాణ బ్యాట్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ యు వి ఎన్ బాబు, అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, టోర్నమెంట్ కన్వీనర్ కరేడ్ల శ్రీనివాసరావు లు మాట్లాడుతూ బ్యాట్మింటన్ టోర్నమెంట్ పోటీలు ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. 19 ప్లస్, 35 ప్లస్, 50 ప్లస్ విభాగాలలో మెన్స్ డబుల్స్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు

మహారుద్ర సహస్ర చండి మహాయాగం ఏర్పాట్లు పరిశీలన

తుర్కయంజాల్ డిసెంబర్23,ప్రభాతవార్త

తుర్కయంజాల్ సర్కిల్ పరిధి రాగన్నగూడలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీవరకు శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో జరిగే మహారుద్ర సహస్రచండీ మహా యోగ మహోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను తెలంగాణ రోడ్డు రాష్ట్ర డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ శర్మ, కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, పోలీస్ అధికారులతో కలిసితో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదురోజుల పాటు జరిగే ఈ యాగంలో సుమారు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. 200మంది బ్రాహ్మణులతో అత్యంత నిష్టతో నిర్వహించబోతున్నామన్నారు. ప్రతిరోజు 2500 మందికి అన్నప్రసాదం, సాయంత్రం స్నాక్స్ ఇస్తామన్నారు. ఐదురోజుల పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. యాగానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మహత్తర యాగంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. అదేవిధంగా మైనార్టీ గురుకుల పాఠశాలలో 2026 =27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రచార కరపత్రాలను

విడుదల చేశారు. విద్యా అవకాశాలను విద్యార్థులు స్పదియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఒక ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ గురుకుల ఉపాధ్యాయురాలు వజ్రేశ్వరి నేత, టి పి సి కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్, మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్,ఎలిమినేటి నరసింహారెడ్డి, వంగేటి గోపాల్ రెడ్డి, రేవెల్లి యాదగిరి, మేతరి దర్శన్, గొండ ధనరాజ్, కొంతం వెంకట్ రెడ్డి, (జానీ) వెంకట్ రెడ్డి, అర్జున్,బాకారం నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

వక్ఫ్ 22ఏ నిషేధంతో ఇబ్బందులు.. మంత్రి అసరుద్దీన్‌కు ఎమ్మెల్యే మర్రి వినతి

మల్కాజిగిరి జనవరి23,ప్రభాతవార్త :

మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలో వక్ఫ్ బోర్డు పేరుతో భూములను రిజిస్ట్రేషన్ యాక్ట్-1908లోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అసరుద్దీన్ను కోరారు. ఈ మేరకు ఆయన మంత్రికి వినతిపత్రం సమర్పించారు.గత నవంబర్‌లో సుమారు 300 ఎకరాల భూమిని వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటూ 22ఏ నిషేధ జాబితాలో చేర్చడంతో 76 కాలనీలకు చెందిన దాదాపు 20 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఏళ్లుగా ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తున్నప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, బ్యాంకు రుణాలు మంజూరు కాకపోవడం, అమ్మకం-గిఫ్ట్ డీడ్ వంటి లావాదేవీలు జరగకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు.ప్రజల హితాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ భూములను సెక్షన్ 22ఏ పరిధి నుంచి

తొలగించి ఆస్తి యజమానులకు న్యాయం చేయాలని మంత్రి అసరుద్దీన్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో నివసిస్తున్న మైనారిటీ ముస్లిం, క్రిస్టియన్ సమాజాలకు స్మశానవాటికల కోసం తగిన స్థలం కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేశారు.దీనిపై మంత్రి అసరుద్దీన్ సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ భేటీలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

అరుదైన డ్యూడెనల్ క్యాన్సర్‌కు విజయవంతంగా చికిత్స చేసిన కేర్ హాస్పిటల్స్ వైద్య బృందం

మలక్ పేట, జనవరి 23, ప్రభాతవార్త:

జీర్ణవ్యవస్థలో అత్యంత అరుదుగా కనిపించే డ్యూడెనల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 65 ఏళ్ల ఓ మహిళకు మలక్‌పేట్ కేర్ హాస్పిటల్స్ వైద్యులు అత్యంత క్లిష్టమైన కీహోల్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడి నూతన జీవితాన్ని అందించారు. మలక్ పేట కేర్ ఆస్పత్రి క్యాన్సర్ఎంటరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ భూపతి రాజేంద్రప్రసాద్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు చెందిన 65 సంవత్సరాల మహిళ డ్యూ డేనల్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం అనేక ఆసుపత్రులను సందర్శించగా శస్త్రచికిత్స ప్రమాదకరమని తిరస్కరించడం జరిగింది. దీంతో మలక్ పేట కేర్ ఆస్పత్రిలో సదరు మహిళ చికిత్స కోసం రావడంతో అత్యంత క్లిష్టమైన విపుల్స్ అనే క్లిష్టమైన కిహోల్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆమెను వైద్యులు కాపాడారు. ఈ శస్త్రచికిత్స అనంతరం ఆమె కేవలం ఐదు రోజుల్లోనే కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడం జరిగిందని వివరించారు.డ్యూడెనల్ క్యాన్సర్ జీర్ణ వ్యవస్థ క్యాన్సర్లలో ఒక శాతం కన్నా తక్కువగా కనిపించే అరుదైన వ్యాధి అని ఆపరేషన్ చాలా క్లిష్టమైనది కావడంతో పాటు ప్రమాదం ఎక్కువగా ఉండటంతో పలు ఆసుపత్రులు శస్త్రచికిత్స చేయడానికి నిరాకరించాయని, దీంతో రోగి కుటుంబం తీవ్ర మానసిక ఆందోళనకు గురై, ఆశలు



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భూపతి రాజేంద్రప్రసాద్, ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల తదితరులు

కోల్పోయిన స్థితికి చేరుకుందని తెలిపారు.సదరు మహిళ ఆరోగ్య పరిస్థితి బలహీనంగా ఉన్నప్పటికీ, చివరకు కేర్ హాస్పిటల్స్‌ను ఆశ్రయించడంతో వైద్యులు పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించి, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాత ఆసుపత్రి వైద్యులు సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ,రోబోటిక్ సర్జన్ డాక్టర్ భూపతి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో వైద్య బృందం క్లిష్టమైవిపుల్స్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆమె త్వరగా కోలుకోవడం మాకు ఎంతో సంతృప్తినిస్తోంది" అని పేర్కొన్నారు.మలక్‌పేట్ కేర్ హాస్పిటల్స్ అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు, మినిమల్లి ఇన్వేసివ్ శస్త్రచికిత్సలతో అత్యంత క్లిష్టమైన, ప్రమాదకరమైన కేసులను కూడా విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి : జేటిసి రమేష్

ఎల్.బి.నగర్, జనవరి 23 ప్రభాతవార్త: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జెటిసి సి.రమేష్ పేర్కొన్నారు. రవాణా శాఖ జిటిసి ఆదేశాల మేరకు జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవంలో భాగంగా మలక్పేట ఆర్టీవో ఎల్.కిష్టయ్య నేతృత్వంలో శుక్రవారం డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు శిక్షణ ఇచ్చే సమయంలో అనేక జాగ్రత్తలు పాటించాలన్నారు. శిక్షణ సమయంలోనే డ్రైవింగ్ నేర్చుకునే వారికి అనేక మెలకువలు నేర్పించాలన్నారు. రాంగ్‌రూట్లో వెళ్లడం, అధికవేగం, సీట్‌బెల్టు, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం తదితర నిబంధనల గురించి డ్రైవింగ్ నేర్చుకునే వారికి వివరించాలని సూచించారు. రవాణాశాఖ నియమ నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలని అన్నారు. అతివేగము, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే పరిణామాల గురించి ఆయన వివరించారు. ప్రేరేపించడం ఐఏఎస్ శిక్షకు

-ర్యాలీలో పాల్గొన్న జేటిసి రమేష్, ఆకెళ్ళ రాఘవేంద్ర

డు ఆకెళ్ళ రాఘవేందర్ మాట్లాడుతూ ప్రయాణాలు చేస్తున్నప్పుడు ముఖ్యంగా వాహనాలు నడిపించేవారు అనేక జాగ్రత్తలను తీసుకునే విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. అజాగ్రాతగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల జరిగే పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ సురేష్ కె.అమర్‌నాథ్, బలరాం, నరేందర్‌పాల్‌సింగ్, ఆర్.రాధిక, ఎంవిఐలు మధుసూదన్‌రెడ్డి, అఫ్రోఫ్, జాన్, హర్షితరెడ్డి, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణ సభ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి

-ఈ సభ ముస్లింలకు వ్యతిరేకం కాదు.. ప్రజలు పుకార్లు నమ్మొద్దు
-భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్

సరూర్‌నగర్, జనవరి 23 ప్రభాతవార్త: అక్రమ చొరబాటుదారులైన బర్మా (మయన్మార్) రోహింగ్యాలు, బంగ్లాదేశీయులను వెనక్కి పంపాలనే డిమాండ్‌తో గణేష్ సేన, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన ధర్మ రక్షణ సభ ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ పిలుపునిచ్చారు. సభ జరిగే బాలాపూర్‌లో శుక్రవారం గణేష్ ఉత్సవ సమితి, గణేష్ సేన నాయకులు, బాలాపూర్ ముఖ్య నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే ధర్మ రక్షణ సభ ముస్లింలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. సభ విషయంలో ప్రజలు ఎటువంటి పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. సభ నిర్వహణ కోసం అనుమతినిచ్చిన హైకోర్టుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పోలీసుల సూచనలు పాటిస్తూ సభను శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. దేశ అంతర్గత భద్రత ఉద్యమానికి బాలాపూర్ గ్రామం నుండే నాంది పలకాలనే ఉద్దేశ్యంతోనే ఈ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. చొరబాటుదారుల వల్ల మన ప్రజల కులవృత్తులపై, వారి భవిష్యత్తులపై అంతే కాకుండా ఇతర రంగాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందనేది ఈ సభ

ధర్మ రక్షణ సభ గురించి వివరిస్తున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్: చిత్రంలో అధ్యక్షుడు రాఘవరావు తదితరులు

ద్వారా తెలియజేస్తామని అన్నారు. ఈ సభ ద్వారా దేశ అంతర్గత భద్రత ఉద్యమానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి తీర్మానాన్ని ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.రాజకీయాలకతీతంగా అందరూ సమిష్టి కృషి చేసి ధర్మ రక్షణ సభను విజయవంతం చేయాలని శశిధర్ పిలుపునిచ్చారు. సమన్వయకర్త కొలను శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరావు, కళ్లెం నిరంజన్‌రెడ్డి, వైకుంఠం, ఆలె భాస్కర్, రామరాజు, చిగిరింత నర్సింహారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, గుండోజు రఘునందనాచారి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బొర్ర రవికుమార్, సంజయ్ ఘనాటే, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, కళ్లెం రాజేందర్‌రెడ్డి, కౌడి మహేందర్, బాల్‌సింగని జంగయ్య, నవారు శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

లార్డ్స్ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు

సరూర్‌నగర్, జనవరి 23 ప్రభాతవార్త: బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ లార్డ్స్ పాఠశాలలో అదే విధంగా మీర్‌పేట్ ఆర్ఎన్‌రెడ్డినగర్‌లోని లార్డ్స్ శ్రీ విద్యావాణి హై స్కూల్‌లో శుక్రవారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లార్డ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి సరస్వతి పూజను నిర్వహించి చిన్నారులచే అక్షరాలను దిద్దించి అక్షరాభ్యాసాలకు శ్రీకారం చుట్టారు. వసంత పంచమి పూజ, అక్షరాభ్యాస కార్యక్రమాల్లో బడంగ్‌పేట్ శాఖ ప్రిన్సిపాల్ రామిడి

చిన్నారులచే అక్షరాభ్యాసం చేయిస్తున్న లార్డ్స్ వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి

సంతోష్, ఇంఛార్జి రేఖా సాగర్, ఆర్ఎన్‌రెడ్డినగర్ బ్రాంచి ప్రిన్సిపాల్ బీరదార్ కిషన్‌రావు, ఇంఛార్జి చంద్రకళ, సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుల తల్లి సరస్వతిని విద్యార్థులు పూజించాలి

మల్కాజిగిరి జనవరి23,ప్రభాతవార్త :

ప్రతి ఒక్క విద్యార్థి చదువుల తల్లి సరస్వతిని పూజించాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తెలిపారు. వసంత పంచమి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ లో గల అంబా భవాని ఆలయంలో విజయ మేరీ స్కూల్ విద్యార్థులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై అంబా భవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు కిట్టు, కన్నా, రాము, నాగభూషణం తోపాటు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఆదర్శ డివిజన్‌గా ఐఎస్ సదన్ : కార్పొరేటర్

సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 23 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ వాణినగర్‌లో రూ.13.07లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులకు, సింగరేణి కాలనీ మెయిన్ రోడ్డులో రూ.29.91లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులకు, ఎస్ఎన్ రెడ్డి కాలనీ ఫేజ్ 2లో రూ.13.24లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులకు, సింగరేణి కాలనీ రోడ్ నెం.7లో రూ.34లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాలలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు కోట్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, విశాల్, సత్యనారాయణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసం

పూజలు నిర్వహిస్తున్న ఇఓ లావణ్య

సైదాబాద్, జనవరి 23 ప్రభాతవార్త: వసంత పంచమిని పురస్కరించుకుని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేకము, అలంకరణ నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. దాదాపు 800కు పైగా చిన్నారులు అక్షరాభ్యాసంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి లావణ్య, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం

అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఎల్.బి.నగర్, జనవరి 23 ప్రభాతవార్త:

వసంత పంచమి సందర్భంగా వాసవి మాత ఆలయంలో అష్టలక్ష్మీ మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం 50 అంగన్వాడీ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులు అందరికీ సరస్వతి మాత ఆశీస్సులు ఉండాలని, ఉన్నత చదువులు అభ్యసించాలని, భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన సుజాత తెలిపారు. చిన్నారులకు పూజా కార్యక్రమం అనంతరం బ్యాగు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, చాక్లెట్స్, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ ను బహుకరించారు.ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి మహిళా మండలి కార్యదర్శి డాక్టర్ ప్రణవిశ